క్లుప్తంగా

విప్లవ గీతాల నడుమ కార్మికుల నిరసన



ప్రజానాట్య మండలి సభ్యుల విప్లవ గీతాల నడుమ ఆందోళన చేస్తున్న కార్మికులు

సామర్లకోట: స్థానిక ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్స్‌లో కార్మికుల తొలగింపునకు నిరసనగా ఆందోళన కొనసాగుతోంది. శనివారం జోరుగా కురుస్తున్న వానలోనూ కార్మికులు నిరసన వ్యక్తం చేయగా వారికి ప్రజానాట్య మండలి కళాకారులు విప్లవ గీతాలతో మద్దతు తెలిపారు. దాంతో సెక్యూరిటీ సిబ్బంది మైక్ తీసుకునే ప్రయత్నం చేయడంతో సీఐటీయూ నాయకులు, కార్మికులు ప్రతిఘటించారు. తొలగించిన కార్మికులకు విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి క్రాంతికుమార్, జిల్లా నాయకుడు మేడిశెట్టి వెంకటరమణ రొంగల వీర్రాజు, డి.సత్యనారాయణ, డి.కృష్ణ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు చంద్రశేఖర్, సతీష్, రామకృష్ణ, వరప్రసాద్, మల్లికార్జునరావు, రాజబాబు, సతీష్‌కుమార్, గంగాధర్, శివనారాయణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

- క్రైం సీఐ అంకబాబు



సామర్లకోట పోలీసు స్టేషన్ ఆవరణలో మొక్క నాటుతున్న సీఐ అంకబాబు

సామర్లకోట: ప్రస్తుత సీజన్‌లో ప్రతి ఒక్కరు కనీసం రెండు మొక్కలు నాటి వాటిని రక్షిస్తూ పర్యావరణాన్ని కాపాడాలని క్రైమ్ సీఐ అంకబాబు అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో శనివారం మొక్కలు నాటు కార్యమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి వద్ద, పొలం గట్లపై తప్పని సరిగా మొక్కలు నాట్టి పచ్చదనం పెంచాలన్నారు. మొక్కలతోనే స్వచ్ఛమైన వాతావరణం ఏర్పడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పదో తేదీన అంగన్‌వాడీల ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్తేరురాణి

పెద్దాపురం: అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల పదో తేదీన చేపట్టిన అంగన్‌వాడీల కోర్కెల దినం ధర్నాలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్తేరురాణి పిలుపునిచ్చారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో శనివారం యూనియన్ అధ్యక్షులు దాడి బేబీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఐసీడీఎస్ బడ్జెను పెంచి అంగన్‌వాడీలను మరింత బలోపేతం చేయాలన్నారు. కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ ప్రీ స్కూళ్లను బలోపేతం చేసి నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలన్నారు. సమస్యల పరిష్కార సాధనకు చేపట్టే ధర్నాలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. సమావేశంలో మహాలక్ష్మి, టిఎల్ పద్మావతి, స్నేహలత, మంగాలక్ష్మి, పాపాయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి వివరాలు యూడైస్‌లో నమోదు చేయండి



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ-2 పుల్లయ్య

సామర్లకోట: పాఠశాలల్లో ప్రతి విద్యార్థి వివరాలు యూడైస్‌లో నమోదు చేయాలని ఎంఈఓ పి.పుల్లయ్య అన్నారు. శనివారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో మండల, పట్టణ పరిధిలోని విద్యార్థుల వివరాలు రెండు రోజులల్లో యు డైస్ వైబ్‌సైట్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య మాట్లాడుతూ 4 నుంచి 15 ఏళ్ల లోపు గల పిల్లలు బడి బయట ఉంటే వారిని తప్పని సరిగా పాఠశాలలో చేర్చుకోవడానికి ఉపాధ్యాయ కమిటీ సభ్యులు, హెచ్ఎంలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ, కంప్యూటర్ ఆపరేటర్ ఎం సుబ్రహ్మణ్యం, హెచ్ఎంలు పాల్గొన్నారు. అనంతరం హైస్కూల్‌లోని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు వడ్డించారు.

సూచిక.. కనిపించక..

- ప్రమాదకరమైన మలుపులు
- కానరాని హెచ్చరిక బోర్డులు
- నిత్యం జరుగుతున్న ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



గోర్స - కొత్తపల్లి రోడ్డులో ప్రమాదకరంగా కల్వర్టు



గోర్స- పిఠాపురం రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న మలుపు

కొత్తపల్లి: పల్లెల్లో రహదారుల మలుపులు ప్రమాదకరంగా మారాయి. ఈ మలుపులు వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలో నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే రహదారుల్లోని మలువుల వద్ద రక్షణ చర్యలు కరువయ్యాయి. సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ఇప్పటికే ఎందరో ప్రాణాలను కోల్పోయారు. పలువురు గాయాలపాలయ్యారు. నిత్యం ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్టు నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

మండల పరిధిలోని ఆయా గ్రామాలకు వెళ్లే కొమరగిరి-ఆనందనగర్, గోర్స-నాగంపేట, పండూరు-కొత్తపల్లి రోడ్డులో మలుపులు ప్రమాదకరంగా మారాయి. ఇక్కడ ఎటువంటి ప్రమాద హెచ్చరికల సూచనల బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రాత్రివేళల్లోను ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ రహదారిలో వెళ్లాలంటే వాహన ప్రయాణికులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం

మండలంలోని పండూరు- కొత్తపల్లి, గోర్స - పిఠాపురం, ఉప్పాడ - పిఠాపురం, నాగులాపల్లి- పిఠాపురం, నాగులాపల్లి- రమణక్కపేట వెళ్ళే రోడ్డులో మలుపులు అతి ప్రమాదకరంగా మారాయి. ఎటువంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రివేళల్లో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రమాదాలు నియంత్రించే దిశగా రోడ్ల అభివద్ధికి ప్రభుత్వం కోట్ల రూపాయలు మంజూరు చేస్తోంది. కానీ ఆర్అండ్‌బీ అధికారులు ప్రమాదకరంగా ఉన్న మలుపులు వద్ద సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయడంలేదు. ప్రతినిత్యం ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మలుపులు వద్ద సూచికల బోర్డులను ఏర్పాటు చేసి ప్రమదాల నివారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి

మలుపులు వద్ద ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రాత్రి వేళల్లో ఈ రహదారుల్లో వెళ్లాలంటే భయపడుతున్నారు. పండూరు - కొత్తపల్లి రోడ్డులో కొమరగిరి శివారు వెంకటరాయపురం సమీయంలో ఉన్న కాలువలో వాహనచోదకులు పడి క్షతగాత్రులవుతున్నారు. ఇటీవల ఒక వ్యక్తి మృతి చెందాడు. గోర్స భద్రుని చెరువు వద్ద ఉన్న మలుపులో అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు ఏ ఒక్క రోజూ కూడా ఈ మలుపులో ఎటువంటి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసిన దాఖలా లేలేవు, రోడ్డుకిరువైపులా తుప్పలు పెరిగి పోవడంతో వాహనచోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు.

– రొంగల వీరబాబు, గోర్స సర్పంచి

వైఎస్సార్ జయంతిని విజయవంతం చేయండి

మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ వంగా గీత

పిఠాపురం: మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని సోమవారం విజయవంతంగా నిర్వహించేందుకు వైఎస్సార్ సీపీ నేతలు కార్యకర్తలు సిద్ధం కావాలని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ వంగా గీత పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆమె శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మహానేత వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించడానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పిఠాపురం నియోజకవర్గంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించదానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆరోజు గ్రామాల వారీగా అన్ని వైఎస్సార్ విగ్రహాల వద్ద వేడుకలు నిర్వహించి, ఉదయం 10 గంటలకు నాయకులు కార్యకర్తలు పిఠాపురం రావాలని ఆమె కోరారు. పిఠాపురంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద జయంతి ఉత్సవాలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆమె తెలిపారు.

నేడు నాగులపల్లిలోని వైద్య శిబిరం

కొత్తపల్లి: నాగులపల్లిలోని శివాలయం వద్ద ఆదివారం చేయుత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరం న్యూరో ఎక్సపర్ట్ క్లినిక్ పర్యవేక్షణలో జనరల్, బీపీ, సుగర్, థైరాయిడ్, గుండె సంబంధిత వ్యాధులు, మలేరియా, టైఫాయిడ్, డెంగీ, చికెన్ గున్యా, విషజ్వరాలు, కీళ్లనొప్పులు, కామెర్లు, గ్యాస్ట్రబుల్, లివర్, ఊపిరితిత్తులకు సంబంధించి వ్యాధులు, చిన్నపిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేస్తారని తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జునోసిస్ డే



శునకానికి యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అరుణ

సామర్లకోట: స్థానిక మండల పశువైద్య కేంద్రంలో జూనోసిస్ డే నిర్వహించారు. లయన్స్ క్లబ్, ఏరియా పశువైద్య కేంద్రం సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పదేళ్లుగా జునోసిస్ డే సందర్భంగా పెంపుడు కుక్కలకు, పశువులకు ఉచితంగా ఏఆర్వీ వేయడం అభినందనీయమన్నారు. ఇందుకు కృషి చేస్తున్న క్లబ్ మాజీ అధ్యక్షుడు సింగవరపు సత్యనారాయణను ఆయన అభినందించారు. ఏటా నూతన కమిటీ ఎన్నికైన వెంటనే మొదటి కార్యక్రమంగా ఏఆర్వీలు వేస్తున్నట్టు తెలిపారు. సేవాభావం ఉన్న వారు లయన్స్ క్లబ్‌లో సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు. వీబీఆర్ఐ జెడీ చంద్రమౌళి నాయక్ మాట్లాడుతూ పెంపుడు కుక్కలకు ఏటా ఏఆర్వీ వేయించాలన్నారు. పశుసంవర్ధక శాఖ ఏడీ పీవీవీ వరప్రసాద్ జునోసిస్ డే ప్రాధాన్యం, కుక్కల పెంపకం వలన వినోదం, ప్రమాదాలను వివరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ మాట్లాడుతూ వీధి కుక్కల కాట్లకు పాదచారులు గురవుతున్న దృష్ట్యా వాటికి కూడా వ్యాక్సిన్ వేయించే బాధ్యత తీసుకోవాలని క్లబ్ సభ్యులకు సూచించారు. జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి మాట్లాడుతూ క్లబ్ సభ్యులు సేవా కార్యక్రమాల్లో భాగంగా మధుమేహం నియంత్రణకూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్ఆర్‌వైవీఆర్ ప్రసాద్ అధ్యక్షత వహించగా జోనల్ చైర్మన్ కానుబోయిన విజయకృష్ణ, సామర్లకోట క్లబ్ కార్యదర్శి టి.సత్యనారాయణ, కోశాధికారి బడుగు బాబి, క్లబ్ మాజీ అధ్యక్షులు కె.ఆదినారాయణరెడ్డి, మేకా శ్రీనివాసరావు, గుండు శంకరరావు, ఎస్.సత్యనారాయణ, పశుసంవర్ధక శాఖ ఏడీ ఇ.ప్రమీల, పశుసంవర్ధశాఖ వైద్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విత్తన, ఎరువులు షాపులలో విజిలెన్స్ అధికారుల తనిఖీ



గొల్లప్రోలులో విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీలో శనివారం విత్తన, ఎరువులు షాపులపై వ్యవసాయ విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన రాష్ట్ర తనిఖీ బృందం విజిలెన్స్, వ్యవసాయ అధికారుల కలసి గొల్లప్రోలు మండలం గొల్లప్రోలులో శ్రీ కృష్ణ ఏజెన్సీస్ ప్రవంతి ఆగ్రో ఏజెన్సీస్‌లో తనిఖీ చేసి ఎటువంటి అభ్యంతరాలు లేవని నిర్ధారించారు. స్టాక్ రిజిస్టర్లు బిల్ బుక్స్ తనిఖీ చేసిన అధికారులు ఎటువంటి తేడాలు లేవని తెలిపారు. ఈ కార్యక్రమానికి శ్రీకాకుళం డీడీఏ కె.త్రినాథస్వామి విజిలెన్స్ డిపార్టుమెంట్ డీవీవీ సతీష్ కుమార్, ఐఒడీ శ్రీకాకుళం పిఠాపురం సహాయ వ్యవసాయసంచాకులు పి.స్వాతి, మండల వ్యవసాయ అధికారి కె.వి.వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి చెరువులో చేపల వేట నిషేధించాలి



జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు

- కలెక్టరుకు కౌన్సిలర్ల వినతి
- ఇప్పటికే ఆదేశించినట్టు బదులిచ్చిన కలెక్టర్

సామర్లకోట: తాగునీటి చెరువులో చేపల వేట నిషేధించాలని మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం కలెక్టర్ ఎస్ షాన్‌మోహన్‌కు మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ ద్వారా సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కొంత కాలంగా పట్టణ ప్రజలకు తాగునీరు అందించే నాగార్జున ఫిల్టర్ చెరువులో చేపల వేట వల్ల తాగునీరు కలుషితమవుతోందని కౌన్సిలర్లు నేతల హరిబాబు, పాగా సురేష్‌కుమార్, సేపెని సురేష్, వైఎస్సార్ సీపీ నాయకులు గంగిరెడ్డి కృష్ణమూర్తి, వారా సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని సుమారు 50 వేల మంది ఫిల్టర్‌బెడ్ నుంచి సరఫరా అవుతున్న నీటిని తాగుతున్నారని, చేపల వేటను శాశ్వతంగా నిలిపివేయాలని వారు కలెక్టరుకు విజ్ఞప్తి చేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ఇప్పటికే చేపల వేటను నిలిపివేయాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించినట్టు కలెక్టరు తెలిపారని కౌన్సిలర్లు స్థానిక విలేకర్లకు తెలిపారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలి



ఆందోళన వ్యక్తం చేస్తున్న ఏఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు

పిఠాపురం: గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు వెంటనే పెంచాలని అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఏఐఎఫ్‌టీయూ) ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు కుంచె అంజిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో ఏఐఎఫ్‌టీయూజిల్లా నాయకులు డి.నారాయణమూర్తి ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంజిబాబు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికులు చాలీచాలని జీతభత్యాలతో జీవిస్తున్నారని తెలిపారు. నారాయణ మూర్తి మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం చొరవ తీసుకొని జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుడాల చార్లీస్, పంచాయతీ కార్మికులు కొరకంటి తాతీలు, పాపారావు, బోడపాటి నాగవిష్ణు, గుడాల సత్యనారాయణ, మహాలక్ష్మి పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు శుభ్రం



ఓవర్ హెడ్ ట్యాకును శుభ్రం చేస్తున్న సిబ్బంది

సాక్షి ఇంపాక్ట్

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో తాగునీరు కలుషితంపై సాక్షి దినపత్రికలో గత నెల 23 తేదీన 'తాగునీరు కలుషితం' అనే శీర్షిక కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అమీనాబాద్ పంచాయతీ కార్యదర్శి రవికుమార్ గ్రామంలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకులను కార్మికులతో శుభ్రం చేయించి, క్లోరినేషన్ చేయించారు.

ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలి



చెందుర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు

పిఠాపురం: సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ అధ్వర్యంలో శనివారం గొల్లప్రోలు మండలం చెందుర్తిలో ర్యాలీ నిర్వహించారు. దీనికి హాజరైన సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర నాయకులు బుగత బంగార్రావు మాట్లాడుతూ చెందుర్తి గ్రామంలో సర్వే నంబర్-1 ప్రభుత్వ పోరంబోకు భూమి 450 ఎకరాలు భూమిని చాలా సంవత్సరాలుగా అన్ని కులాల పేదలు సాగు చేసుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వం గతంలో ఈ భూమిపై పశువాదశాలకు, డంపింగ్ యార్డ్‌లకు, ఇతర కంపెనీలకు లీజులకు ఇచ్చేసింది, దీనిని వ్యతిరేకిస్తు కోర్టు ద్వారా, ప్రత్యక్ష పోరాటాల ద్వారా ఉద్యమం చేసుకొని ఆ భూములను రక్షించుకునేందుకు పోరాటం చేస్తున్నామన్నారు. పేదలు జీడి మామిడి తోటలు సాగు చేసుకుంటున్నారన్నారు. ఈ భూమిపై పెద్దలు ఏదో రకంగా దక్కించుకోవడానికి రికార్డులు అన్నింటిని కూడా తారుమారు చేసి స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. సాగులో ఉన్న పేదలని ధనం ఇతర ఆశలు ఆసక్తి వాళ్లని అనేక ప్రలోభాలకు పెట్టి అమ్మకాలు చేయడానికి కొనుగోలు చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ భూములను పేదలకు పట్టాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కె.జనార్దన్, సీపీఐ ఎంఎల్ అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కాకర రత్నకుమారి, అఖిలభారత ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర నాయకులు, నక్క మంగమ్మ, కన్నడ శ్రీను, నక్క అప్పన్న, తగెళ్ల మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో హుండీల చోరీ



ఆలయంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ కాంప్లెక్‌లోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో హుండీలు చోరీకి గురయ్యాయి. శనివారం తెల్లవారుజామున ఆలయంలో దొంగలు చోరబడి తలుపులను బద్దలగొట్టి స్వామి వారి హుండీలలో సుమారు యాభైవేల రూపాయల నగదును దోపిడీ చేశారు. ఉదయం ఆలయం తెరచి చూసేసరికి హుండీలు పగులగొట్టి ఉండడంతో ఆలయ కమిటీ సభ్యులు సిద్ధ వీరబాబు, ముమ్మిడి ఈశ్వరరావు, మాదేపల్లి నాగేశ్వరరావు తదితరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గొల్లప్రోలు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఆలయ కమిటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్లూస్‌టీం అధికారులు హుండీలు ఆలయ పరిసరాల్లో వేలి ముద్రలు సేకరించారు.

ప్రభుత్వ మద్యం దుకాణంలో చోరీ

పిఠాపురం: గ్రామం నుంచి చిత్రాడ వెళ్లే దారిలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణంలో గుర్తు తెలియని దుండగులు శనివారం తెల్లవారుజామున చోరీకి పాల్పడ్డారు. పిఠాపురం పట్టణ పోలీసుల కథనం ప్రకారం.. చిత్రాడ వెళ్లే దారిలో ఉన్న మద్యం దుకాణంలో గర్తు తెలియని దుండగులు దుకాణం పైకప్పు తొలగించి 42 ఫుల్ బాటిళ్లు, 10 బీరు బాటిళ్ళు చోరీ చేశారు. దుకాణ సిబ్బంది శనివారం ఉదయం వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పిఠాపురం పట్టణ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వారాహీదేవిగా దేవీచౌక్ కనకదుర్గమ్మ



వారాహీదేవిగా పూజలందుకుంటున్న కనకదుర్గమ్మ

గోకవరం: స్థానిక ప్రసిద్ధి చెందిన దేవీచౌక్ ఆలయంలో ఉన్న కనకదుర్గమ్మ శనివారం వారాహీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసం ప్రారంభం వారాహీ నవరాత్రులను పురస్కరించుకుని ఆలయ అర్చకులు డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మలు అమ్మవారిని వారాహీదేవిగా అలంకరించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ వారాహీ నవరాత్రులు నిర్వహిస్తున్నట్టు అర్చకులు తెలిపారు

పత్తిలో అంతర సాగు లాభదాయకం



హంసవరంలో పత్తిపైరులో అంతర పంట సాగును పరిశీలిస్తున్న ఏడీఏ భ్రమరాంబ

తుని రూరల్: పత్తిపంటలో అంతర పంటల సాగు లాభదాయకంగా ఉంటుందని జిల్లా వనరుల కేంద్రం (డీఆర్‌సీ) వ్యవసాయ సహాయ సంచాలకులు భ్రమరాంబ అన్నారు. శనివారం హంసవరం గ్రామంలో పత్తిపైర్లను ఏఓ బి.అశోక్ కుమార్‌తో కలసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. పత్తిలో అంతర పంటలు సాగు చేయడం వల్ల తెగుళ్ళు, పురుగులను నివారించుకోవచ్చన్నారు. అంతర పంటల సాగుతో అదనపు ఆదాయం రైతులు పొందవచ్చన్నారు. రాగి పైర్లను ఆరుతడిగా సాగు చేసుకోవచ్చని, తక్కువ పెట్టుబడితో అధికాదాయం లభిస్తుందన్నారు. రాగి పైర్లను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్టు ఆమె తెలిపారు. రాగిపైరు సాగు చేస్తున్న రైతులను గుర్తింపు ప్రక్రియ జరుగుతుందన్నారు. రైతులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం

- జిల్లా జడ్జి కమలాదేవి

కాకినాడ లీగల్: ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పి.కమలాదేవి అన్నారు. శనివారం కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి కోర్టు హాలులో ట్రాఫిక్ పోలీసులు, అధికారులుతో కోర్టు ఉద్యోగులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి కమలాదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమన్నారు.ట్రాఫిక్ పోలీస్ అధికారులు మాట్లాడుతూ ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యాన్ని చేరండని, వేగం కన్నా ప్రాణం మిన్న అని ఉద్యోగులుకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి కాకినాడ ట్రాఫిక్ 1, 2 సీఐలు ఎస్.రమేష్, చైతన్యకృష్ణ, అధికారులు ఏవీ పద్మావతి, కె.రామస్వామి, డి.శ్రీకాంత్‌బాబు, కోర్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి భక్తుల తాకిడి

గోకవరం: తంటికొండ గ్రామంలో గుమ్మళ్లదొడ్డిలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వెంకటగిరి కొండపై వెలసిన స్వామివారిని తెల్లవారు జాము నుంచి భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామి వారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. గుమ్మళ్లదొడ్డి గ్రామ శివారున పుట్టలో వెలసిన వల్మీక వేంకటేశ్వరస్వామి ఆలయానికి వేలాదిగా భక్తులకు తరలివచ్చారు. మండలం నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులకు కాలినడకన ఆలయానికి వచ్చి ప్రదిక్షణలు చేసి మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం ఆలయంలో అన్నదానం నిర్వహించారు.

ప్లాస్టిక్ సంచులతో పర్యావరణానికి హాని

లయన్స్ క్లబ్ ప్రాంతీయ చైర్మన్ పద్మ తులసి



మొక్కలు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ స్టార్ అధ్యక్షురాలు షర్మిల

కాకినాడ రూరల్: ప్లాస్టిక్ సంచుల వినియోగం ద్వారా పర్యావరణానికి హాని కలుగుతోందని, వాటి స్థానంలో కాగితపు సంచులు వినియోగించాలని లయన్స్ క్లబ్ ప్రాంతీయ చైర్మన్ పద్మ తులసి పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో శనివారం వస్త్ర సంచులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులు మానవ జీవితంతో మమేకమై ప్రతి వస్తువును వాటితో తీసుకువచ్చే పరిస్థితి నెలకొందన్నారు. ప్లాస్టిక్ సంచులు భూమిలో ఏళ్ల తరబడి నిల్వ ఉండి వర్షపు నీరు ఇంకకుండా అడ్డుకుంటున్నాయన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ వస్త్ర, కాగితపు సంచులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు ఎం.ప్రసన్న, శ్రీదేవిరెడ్డి, శ్రీవాణి, రమాసుందరి, విజయలక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

బోట్‌క్లబ్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు నడుం బిగించాలని లయన్స్ క్లబ్ కాకినాడ స్టార్స్ ప్రతినిధి గరికిపాటి నమఃశివయ్య అన్నారు. లయన్స్ క్లబ్ కాకినాడ స్టార్స్ ఆధ్వర్యంలో శనివారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కల పంపిణీ చేపట్టారు. రామారావు పేటలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ స్టార్ అధ్యక్షురాలు షర్మిల అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నమఃశివయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలన్నారు. కోవిడ్ సమయంలో ఆక్సిజన్ దొరకక ఎందరో తమ ప్రాణాలు కోల్పోయారన్నారు. వాతారణ సమతుల్యతను పొందాలంటే మొక్కలు ఎక్కువగా నాటాలన్నారు. అనంతరం రామారావు పేట ప్రాంతంలో ఉచితంగా మొక్కల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నాగేశ్వరి, నాగమణి, వీఎస్ఆర్ మూర్తి, నాగిని పాల్గొన్నారు.